# విదేశీ కార్మికులకు ద్వారాలు తెరుస్తోన్న జపాన్

**పారిశ్రామికంగానూ,** ఉన్నత సాంకేతికత పరంగానూ అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశమైన జపాన్, అధికంగా మహిళలను పరిశ్రమలలోకి తీసుకోవటంద్వారా, రోబో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవటం ద్వారా వలసకార్మికుల అవసరం లేకుండానే తన దేశంలో కార్మికుల కొరత సమస్యను పరిష్కరించు కోగలుగుతున్నామని గొప్పలు చెబుతోంది.

ఇలాంటి ఆడంబర ప్రకటనలు వింటానికి బాగానే వుండవచ్చుకానీ కార్మికుల శ్రమశక్తిని, అది కూడా కారుచౌకగా లభించే వలస కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేయకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ సాగించలేదని, కొనసాగలేదనే వాస్తవాన్ని, ఈ ప్రకటనలు మరుగుపర్చలేవు.

ఇటీవలి కాలపు జపాన్ అనుభవం ఈ అంశాన్నే రుజువు చేస్తోంది. 2018 నవంబర్ 18 మొదటివారంలో, దేశంలోకి లక్షలాదిమంది వలస కార్మికుల చట్టబద్ధ ప్రవేశాన్ని మొదటిసారిగా అనుమతిస్తూ జపాన్ ప్రభుత్వం ఓ చట్టాన్ని ప్రతిపాదించింది. పార్లమెంట్ ఆమోదం కూడా పొందితే 2019 ఏప్రిల్ నుండి ఇది అమలులో కొస్తుంది.

ఇన్ని సంవత్సరాలుగా వలస కార్మికులు సరైన అధికార పత్రాలు లేకుండానే జపాన్‌లోకి ప్రవేశించారు. 2012లో జపాన్‌లో 6,82,480 మంది విదేశీ కార్మికులుండగా, 2017 నాటికి ఈ సంఖ్య 12,78,670గా రెట్టింపైంది. వీరిలో సగానికిపైగా 'సాంకేతిక విద్యాభ్యాసకులుగా" పాక్షిక కార్మికులుగా జపాన్‌లో శిక్షణ కోసమనే పేర నివశిస్తూ, నైపుణ్యం తక్కువస్థాయిలో వున్న పారిశ్రామిక కార్మికులుగా వినియోగించుకో బడుతున్నారు.

జపాన్ ప్రభుత్వం ప్రస్తుతం చేసిన చట్ట ప్రతిపాదనతో సంవత్సరానికి 40,000 మంది కార్మికుల చొప్పున రానున్న ఐదు సంవత్సరాలలో తమ దేశంలో వలస కార్మికుల సంఖ్య 2,50,000కు చేరుకోవచ్చని భావిస్తోంది.

ఈ విదేశీ కార్మికులను – వ్యవసాయం, నర్సింగ్, భవన నిర్మాణరంగం, వైద్యసేవలు మొదలైన కార్మికుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న 14 విభాగాలలోకి అనుమతిస్తారు. ప్రతిపాదిత చట్టం ప్రకారం 2 నూతన వీసా శ్రేణులు ఏర్పరిచారు. మొదటిది–నైపుణ్య రహిత కార్మికుల కోసం. వీరిని కేవలం 5 సం॥ కాలం వరకు మాత్రమే దేశంలో వుండటానికి అనుమతిస్తారు. వీరి ఈ కాలపరిమితి పెంపు జేసే అవకాశం లేదు. ఇక రెండవ శ్రేణి – అధిక నైపుణ్యంగల వలస కార్మికులకోసం. వీరు తమ వీసాలను నిరవధికంగా పునరుద్ధరించుకుంటూ దేశంలోనే కొనసాగవచ్చు. వీరు తమ కుటుంబాలతో సహా ఆ దేశంలోనే నివశించవచ్చు.

ఇతర అభివృద్ధిచెందిన దేశాలలో వలె జపాన్‌లో కూడా వలసకార్మికుల ప్రవేశానికి జపాన్ ప్రజానీకం సుముఖంగా లేరు. వలస కార్మికుల ప్రవేశంతో సామాజిక ఉద్రిక్తతలు, నేరాలు పెరుగుతాయనే తప్పుడు అభిప్రాయం కలిగివుండటంతోపాటు, వీరి రద్దీవలన ప్రజాసేవల నిర్వహణమీద అధికభారం మోపబడుతుందనే భావనతో వున్నారు.

అయితే, ఈ అభిప్రాయాలను సర్దుబాటు చేయటానికి జపాన్ ప్రధాని అబే ఈ నూతన ప్రతిపాదిత చట్టాన్ని 'వలస విధానం'తో సరిసమానంగా భావించవద్దని పదేపదే చెబుతూ వస్తున్నాడు.

ఈ విధంగా పెట్టుబడిదారీ దేశమైన జపాన్, వలస కార్మికుల శ్రామికశక్తిపై ఆధారపడి లబ్ధిపొంటానికి, కొనసాగటానికి నిశ్చయించుకుంది. అదే సమయంలో, వలస కార్మికులను తన దేశంలోని పౌరులతో సమానంగా చూడటానికి, వారికి సామాజిక సంక్షేమం కల్పించటానికి, వారిపట్ల వివక్షను అరికట్టటానికి మాత్రం నిరాకరిస్తోంది.

పెట్టుబడిదారీ విధానపు వర్గస్వభావం ఇలానే వుంటుంది. వలసకార్మికుల శ్రామికశక్తిపై ఆధారపడి ఒకవైపు కొనసాగుతూనే, అదే సమయంలో మరోవైపున తన దేశ పౌరులతో సమానంగా వారిని కనీసం మనుషులుగా, మానవ హుందాతనం కలిగినవారిగా గుర్తించటానికి నిరాకరిస్తోంది. ప్రపంచీకరణ యుగంలో సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానాలు అవలంబిస్తున్న నూతన రూపంలోని బానిసత్వ విధానమే ఇది.

పెట్టుబడిదారీ విధానపు ఈ తరహా వంచనాత్మకమైన విధానాలను వ్యతిరేకించటంతో పాటు, ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గం వీనికి వ్యతిరేకంగా అన్నిరకాల పోరాటాలకు సంసిద్ధం కావాలి.

ooooo